# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 11-02-2026** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ సమావేశాలు ఈ రోజు నుంచి ప్రారంభం కానున్నాయి.**
2. **తెలంగాణలోని మున్సిపల్ ఎన్నికల పోలింగ్ మరికాసేపట్లో ప్రారంభం కానుంది.**
3. **మత్స్యకారుల సంక్షేమమే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ లక్ష్యమని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు.**
4. **పర్యావరణ పరిరక్షణకు, ఆరోగ్యాన్ని ప్రోత్సహించడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎలక్ట్రిక్ ఈ- సైకిల్ కార్యక్రమాన్ని అమలు చేస్తోందని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు.**
5. **ప్రఖ్యాత శాస్త్రవేత్త థామస్ ఆల్వా ఎడిసన్ జయంతి ఈరోజు.**

==========================

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ సమావేశాలు ఈరోజు నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం 10 గంటలకు శాసనసభ శాసనమండలి ప్రారంభమవుతాయి. అనంతరం ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్ర గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ ప్రసంగిస్తారు. అనంతరం బిజినెస్ అడ్వైజరీ కమిటీ- బీఏసీ సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో శాసనసభను ఎన్ని రోజులు నిర్వహించాలన్న అంశంపై చర్చించి నిర్ణయించనున్నారు. ఈ సమావేశాల్లో 2026-27కి సంబంధించిన రాష్ట్ర బడ్జెట్ ను ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

--------------------------

తెలంగాణలోని మున్సిపల్ ఎన్నికల పోలింగ్ మరికాసేపట్లో ప్రారంభం కానుంది. రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు ఈ ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరగనుంది.పోలింగ్ నిర్వహించేందుకు ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. ఎన్నికల కోసం 8 వేల 203 పోలింగ్ కేంద్రాలను, 16 వేల 301 బాలెట్ బాక్సులను ఎన్నికల సంఘం ఏర్పాటు చేసింది. మొత్తం 12 వేల 930 మంది అభ్యర్థులు ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. ఎన్నికల భద్రతా ఏర్పాట్లపై తెలంగాణ డిజిపి రాజేందర్ రెడ్డి పాత్రికేయులతో మాట్లాడుతూ,

వాయిస్ 31సెకన్లు

ఈ నెల 13న ఓట్ల లెక్కింపు జరగనుండగా, 16న మేయర్ , చైర్మన్ల పరోక్ష ఎన్నిక జరగనుంది.

---

జాతీయ స్థాయి బోధకాలు నివారణ కార్యక్రమంలో భాగంగా దేశ వ్యాప్తంగా ఎంపిక చేసిన జిల్లాల్లో మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా నిన్న ప్రారంభించారు. ఇందుకు అనుగుణంగా దేశ వ్యాప్తంగా 124 జిల్లాల్లో ఎంపికచేసిన ప్రాంతాల్లో బోదకాలు నివారణ మాత్రలను పంపిణీ చేయనున్నారు. దృశ్య మాధ్యమ విధానంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ నుంచి వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రచార గోడ పత్రికను ఆవిష్కరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని ఉమ్మడి విజయనగరం జిల్లాలోని గుర్ల, బలిజపేట మండలాల్లో నివాసం ఉండే లక్షా 31 వేల 229 మందికి డీఈసీ, అల్బండజోల్ మాత్రలను పంపిణీ చేస్తామని తెలిపారు.

---

మత్స్యకారుల సంక్షేమమే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ లక్ష్యమని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ప్రకాశం జిల్లా అద్దంకి మండలం మణికేశ్వరంలో మత్స్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన "మీనోత్సవం" కార్యక్రమంలో మంత్రి పాల్గొని గుండ్లకమ్మ నదిలో నిన్న చేప పిల్లలను వదిలారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ,

వాయిస్ 25 సెకన్లు

---

మహా శివరాత్రి నాటికి ఆంధ్రప్రదేశ్ లోని శైవ క్షేత్రాల్లో భక్తుల రద్దీ మరింత పెరిగే అవకాశం ఉన్నందున పటిష్ట చర్యలు తీసుకోవాలని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు. శ్రీశైలం సహా ఆంధ్రప్రదేశ్ లోని వివిధ శైవ క్షేత్రాల్లో భక్తుల రద్దీ, వసతులు, ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో అమరావతి నుంచి దృశ్యమాధ్యమం విధానంలో మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేవాదాయ శాఖ, పోలీస్ శాఖ, జిల్లా కలెక్టర్ల పూర్తి సమన్వయంతో ఏర్పాట్లు, వసతులపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని సూచించారు. భక్తులకు పాలు, బిస్కెట్లు, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.

---

పర్యావరణ పరిరక్షణకు, ఆరోగ్యాన్ని ప్రోత్సహించడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎలక్ట్రిక్ ఈ- సైకిల్ కార్యక్రమాన్ని అమలు చేస్తోందని గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. కృష్ణాజిల్లా మచిలీపట్నంలో నిర్వహించిన ఈ – సైకిల్ కార్యక్రమంలో భాగంగా స్వయం సహాయక సంఘాల మహిళలకు సైకిళ్లను మంత్రి నిన్న పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డికే బాలాజీతో కలిసి ఆయన సైకిల్ ను నడిపారు. ప్రతిరోజు అరగంట సేపు సైకిల్ తొక్కడం వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చని మంత్రి ఈ సందర్భంగా తెలియజేస్తూ,

వాయిస్ 33 సెకన్లు

---

దేశంలోని వివిధ రాష్ట్రాలు, భాషలు, సంస్కృతులను జాతీయ భావనతో కలిపే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం "ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్" కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రాల మధ్య సాంస్కృతిక

మార్పిడులు, భాషా అవగాహన, విద్యా–యువజన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ కార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ ను పంజాబ్ రాష్ట్రంతో జత చేశారు. దీని ద్వారా ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు పంజాబీ భాష, సంస్కృతిని, పంజాబ్ విద్యార్థులు తెలుగు భాష, సంస్కృతి గురించి అవగాహన పొందనున్నారు. విద్యాసంస్థలు, కళా బృందాలు, క్రీడాకారులు పరస్పర రాష్ట్రాలకు వెళ్లి ఆయా ప్రాంతాల స్థానిక సంప్రదాయాలను తెలుసుకుంటున్నారు. దీనివల్ల యువతలో జాతీయ సమైక్యత మరింత బలపడుతుందని అధికారులు తెలిపారు.

---------------------------

మానవ జాతిని ప్రభావితం చేసిన విద్యుత్ బల్బు ఫోనోగ్రాఫ్ లాంటి అనేక ఉపకరణాలను కనుగొన్న ప్రఖ్యాత శాస్త్రవేత్త థామస్ ఆల్వా ఎడిసన్ జయంతి ఈరోజు. తన ఆవిష్కరణలతో సమాజం రూపురేఖలనే పూర్తిగా మార్చివేసిన ఆయన 1847 ఫిబ్రవరి 11వ తేదీన అమెరికాలోని మిలాన్‌లో జన్మించారు. ఆవిరి యంత్ర దశ నుండి విద్యుత్ కాంతుల్లోకి, నాగరికత పయనించడానికి ఎడిసన్ పరిశోధనలే ప్రధాన కారణం. 13 వందల ఆవిష్కరణలపై పేటెంట్ హక్కులు పొందిన ఆయన 1931 అక్టోబర్ 18వ తేదీన కన్నుమూశారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల్లో చలి తీవ్రత క్రమంగా తగ్గుతుండగా.. ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. వాయవ్య ఈశాన్య దిశగా గాలులు వీస్తున్నాయని, దీంతో తెలుగు రాష్ట్రాల్లో పొడి వాతావరణం కొనసాగుతోందని భారత వాతావరణ శాఖ తెలిపింది. అలాగే కొన్ని ప్రాంతాల్లో పొగమంచు కురిసే అవకాశముందని పేర్కొంది.

మన్యం ప్రాంతాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు కొనసాగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేటలో 7.3 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు కాగా.. తెలంగాణాలోని కోహీర్‌లో 7.9 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. జిల్లాలోని విజ్జేశ్వరం గ్రామంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను మంత్రి నిన్న క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. మూలధన పెట్టుబడుల కోసం రాష్ట్రాలకు ప్రత్యేక సహాయం– శాస్కీ పథకం కింద నిడదవోలు నియోజకవర్గానికి 29 కోట్ల రూపాయలను మంజూరు చేశామన్నారు. గడిచిన 18 నెలల్లోనే 60 లక్షలకు పైగా వ్యయం చేసి విజ్జేశ్వరంలో అభివృద్ధి పనులు చేపట్టామని వివరించారు.

---------------------------

మహా శివరాత్రి నాటికి ఆంధ్రప్రదేశ్ లోని శైవ క్షేత్రాల్లో భక్తుల రద్దీ మరింత పెరిగే అవకాశం ఉన్నందున పటిష్ట చర్యలు తీసుకోవాలని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు. శ్రీశైలం సహా ఆంధ్రప్రదేశ్ లోని వివిధ శైవ క్షేత్రాల్లో భక్తుల రద్దీ, వసతులు, ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో అమరావతి నుంచి దృశ్యమాధ్యమం విధానంలో మంత్రి నిన్న సమీక్ష సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు.

=====================